'సంక్రాంతికి వస్తున్నాం' చిత్ర విక్టరీ వేడుకలను సోమవారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరై చిత్ర యూనిట్ సభ్యులు, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్‌కు జ్ఞాపికల్ని అందించారు. ఈ వేడుకలో దర్శకులు హరీష్‌శంకర్, వశిష్ఠ, వంశీపైడిపల్లి తదితరులు పాల్గొన్నారు. వెంకటేష్, ఐశ్వర్యరాజేష్, మీనాక్షి చౌదరి నాయకానాయికలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మించిన ఈ చిత్రం 300కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది.

సినిమా టైటిల్ అదేనా?



రామ్‌చరణ్, బుచ్చిబాబు సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ డ్రామాకు 'పెద్ది' అనే టైటిల్ ఖరారైనట్టు వార్త లొచ్చాయి. అయితే.. ఇప్పుడు 'పవర్ క్రికెట్' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నట్టు తెలుస్తున్నది. కథ రీత్యా ఇందులో రెండు క్రీడలు కీలకంగా ఉంటాయట. ప్రథమార్ధం అంతా క్రికెట్ నేపథ్యంలో కథ సాగుతుంది. ద్వితీయార్ధంలో కుస్తీ కీలకం అవుతుందట. అందుకే అటు కుస్తి.. ఇటు క్రికెట్ కలిసొచ్చేలా.. 'పవర్ క్రికెట్' అనే టైటిల్‌ని ఖరారు చేశారని సమాచారం. దర్శకుడు బుచ్చిబాబు దాదాపు రెండేళ్లు ఈ స్క్రిప్ట్‌పై పనిచేశారు. విజయ్‌సేతుపతి లాంటి అభిరుచి గల నటుడు ఈ కథను అద్భుతం అన్నారట. తొలి సినిమాతోనే జాతీయ అవార్డు సొంతం చేసుకున్న బుచ్చిబాబు, రెండో సినిమాతోనే టాప్ స్టార్ రామ్‌చరణ్‌ని డైరెక్ట్ చేసే ఛాన్స్ కొట్టేశారు. ఎలాగైనా ద్వితీయ విఘ్నాన్ని కూడా అధిగమించాలనే కసితో ఈ సినిమాకు ఆయన పని చేస్తున్నారట. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, జగపతిబాబు కీలక పాత్రధారులు. ఏఆర్ రెహమాన్ స్వరాలందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీమూవీమేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ కలిసి నిర్మిస్తున్నాయి.

ఇక రాజకీయాలకు దూరంగా ఉంటా

'ఈ జన్మంతా ఇక రాజకీయాలకు దూరంగా ఉంటూ ఆ కళామతల్లితోనే ప్రయాణం సాగిస్తాను. పెద్ద పెద్ద వాళ్లకి దగ్గరవుతున్నాను కాబట్టి నేను మళ్లీ రాజకీయాల్లోకి వెళ్తానేమోనని చాలా మందికి డౌట్స్ వస్తున్నాయి. మరో రకంగా సేవలందించడానికి మాత్రమే వాళ్లతో సంబంధాలు కొనసాగిస్తున్నా తప్ప పొలిటికల్‌గా వెళ్లడం అనేది లేదు. రాజకీయంగా నా ఆశయాలను నెరవేర్చడానికి పవన్‌కల్యాణ్ ఉన్నాడు' అన్నారు అగ్ర నటుడు చిరంజీవి. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన 'బ్రహ్మా ఆనందం' చిత్ర ప్రీరిలీజ్ వేడుకకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకత్వం వహించారు. స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రాహుల్ యాదవ్ నక్కా నిర్మించారు. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ''చంటబ్బాయ్' షూటింగ్ టైమ్‌లో నాకు బ్రహ్మానందతో పరిచయం ఏర్పడింది. ఆయన మిమిక్రీ చేసి మా చిత్రబృందాన్ని మొత్తం కడుపుబ్బా నవ్వించేవారు. ఇంతటి ప్రతిభ ఇక్కడే ఆగిపోకూడదనుకొని చెన్నైకి రమ్మని ఆహ్వానించాను. ఆయన్ని తొలుత చెన్నైకి విమానంలో నేనే తీసుకెళ్లాను. మా ఇద్దరిది గురుశిష్యుల అనుబంధం. ఆయన నా ఆత్మబంధువు. నాకు ఎంతో ఆత్మీయుడైన బ్రహ్మానందం తనయుడు రాజా గౌతమ్ నటించిన ఈ సినిమా పెద్ద హిట్ కావాలని, నటుడిగా ఆయన భవిష్యత్తు బంగారం కావాలని కోరుకుంటున్నా' అన్నారు.

బ్రహ్మానందం మాట్లాడుతూ 'సరదాగా జీవితాన్ని గడిపే ఓ తాత, కాస్త గర్విష్టి అయిన మనవడు మధ్య ఈ కథ నడుస్తుంది. తాతామనవడి ప్రేమకథ ఇది. మెగాస్టార్ చిరంజీవితో నాది నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుబంధం. చిరంజీవి నిజమైన ట్రెండ్‌సెట్టర్. ఆయన్ని కారణజన్ముడని చెప్పొచ్చు. విశ్వమంతా విస్తరించిన కల్పవృక్షం ఆయన' అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు నాగ్‌అశ్విన్, అనిల్ రావిపూడితో పాటు చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

చైతూ నటన చూస్తుంటే నాన్న గుర్తొచ్చారు

'అరవింద్‌గారు సినిమా కథ విన్న వేళా విశేషం, శోభితను నాగచైతన్య పెళ్లాడిన వేళావిశేషం రెండూ బావున్నాయి. ఈ సినిమా రిలీజ్ టైమ్‌లో మేం ఢిల్లీలో మోడీగార్ని కలవడానికి వెళ్లాం. సక్సెస్ అయ్యిందని ఒకటే మెసేజ్‌లు. ఇలాంటి విజయాన్ని చూసి చాలాకాలమైంది. ఇంతటి మంచి లవ్‌స్టోరీ చేసిన అరవింద్‌గారికి థ్యాంక్స్. 'గజని' సినిమాతో తొలి వందకోట్ల సినిమా తీసి రికార్డ్ సృష్టించారాయన. ఈ సినిమాకు కూడా వందకోట్లు వస్తాయంటున్నారు. ఇలాంటి విజయాలు ఆయనకు కొత్త కాదు. చందూ మొండేటి అద్భుతంగా తీశాడు. ఇక సాయిపల్లవిలో కనిపించే ప్యూరిటీ ఆమె చేసిన పాత్రలోనూ కనిపించింది. రెండేళ్లు ఈ సినిమాకోసం ఎంతో కష్టపడ్డాడు చైతూ. ఇందులో చైతూ నటన చూస్తే నాన్నగారు గుర్తొచ్చారు.' అని అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున అన్నారు. ఆయన తనయుడు నాగచైతన్య హీరోగా రూపొందిన చిత్రం 'తండేల్'. సాయిపల్లవి కథానాయిక. చందూ మొండేటి దర్శకుడు. బన్నీ వాసు నిర్మాత. ఇటీవలే సినిమా విడుదలైంది. ఈ సినిమా సక్సెస్‌మీట్‌ను మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడారు. అక్కినేని శోభిత కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. నాగచైతన్య మాట్లాడుతూ 'వస్తున్న స్పందన చూస్తుంటే చెప్పలేని ఆనందంగా ఉంది. '100పర్సంట్ లవ్' నా కెరీర్‌కి ఎంత బూస్ట్ ఇచ్చిందో.. ఈ సినిమా అంతకు మించి బూస్ట్ ఇచ్చింది. అందుకే అరవింద్‌గారికి థ్యాంక్స్. చందూ మొండేటితో ఇది నా మూడో సినిమా. ప్రాణం పెట్టి పనిచేశాడు.' అని ఆనందం వెలిబుచ్చారు. ఇకనుంచి అక్కినేని విజయాల పరంపర మొదలైనట్టేనని, త్వరలో చైతూతో 'తెనాలి రామకృష్ణ' చేయబోతున్నామని, ఆ పాత్రలో లెజెండ్రీ అక్కినేనిని తలపించేంత గొప్పగా చైతూను ప్రెజెంట్ చేయబోతున్నామని దర్శకుడు చందూ మొండేటి తెలిపారు. ఇంకా అతిథిగా విచ్చేసిన సి.అశ్వనీదత్‌తో పాటు అల్లు అరవింద్, దేవిశ్రీప్రసాద్, బన్నీవాసు చిత్రయూనిట్ సభ్యులంతా పాల్గొన్నారు.

విశ్వక్‌ని ఆ గెటప్‌లో చూసి కళ్లు తిప్పుకోలేకపోయాం

'నా తొలి సినిమా 'బట్టల రామస్వామి బయోపిక్' 2021లో ఓటీటీ రిలీజై ప్రేక్షకాదరణ పొందింది. ఆ తర్వాత ఓ యూనిక్ కథతో రావాలనుకున్నాను. హీరో లేడీ గెటప్ వేయడం యూనిక్ కాన్సెప్ట్. క్యారెక్టరైజేషన్ సరిగ్గా కుదిరితే అద్భుతంగా వస్తుంది. అందుకే రీసెర్చ్ చేసి ఈ కథ రాశా.' అని దర్శకుడు రామ్‌నారాయణ్ అన్నారు. విశ్వక్‌సేన్ హీరోగా ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'లైలా'. సాహు గారపాటి నిర్మాత. ఈ నెల 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'బ్యూటీపార్లర్‌లో పనిచేసే ఓ మేల్ క్యారెక్టర్.. పరిస్థితుల ప్రభావం వల్ల ఫిమేల్‌గా గెటప్ మార్చుకోవాల్సొస్తే ఎలా వుంటుంది? అనే ఆలోచనతో ఈ కథ రాశా. కథ నచ్చి సాహు గారపాటి తీయడానికి ముందుకొచ్చారు. ఇద్దరుముగ్గురు హీరోలకు కథ వినిపించాం. లేడీ కేరక్టర్ అనగానే వెనక్కు తగ్గారు. చివరకు సాహుగారే విశ్వక్ పేరు సూచించారు. మాస్ హీరో విశ్వక్ ఈ తరహా పాత్ర చేస్తారా?! అనే డౌట్‌తో ఆయన్ను కలిశా. విషయం చెప్పకుండా కథ వినిపించా. ఇంటర్వెల్‌కే ఆయనకర్థమైపోయింది. ఫస్టాఫ్ అంతా సోనూగా కనిపిస్తారు. సెకండాఫ్ నుంచి ఆయన లైలాగా మారతారు. విశ్వక్‌కి ఎప్పట్నుంచో లేడీ కేరక్టర్ చేయాలనే కోరిక ఉందట. ఈ కథ చెప్పడంతో ఇమేజ్‌ను పక్కన పెట్టి ఓకే చేశారు.' అని చెప్పారు. ఈ కథలో వల్గారిటీ ఉండదని, నాటీనెస్ మాత్రమే ఉంటుందని, ఫ్యామిలీ ఆడియన్స్ కూడా చూడదగ్గ క్లీన్ ఎంటర్‌టైనరని, ఇందులో కామెడీ, యాక్షన్, ఎమోషన్స్ అన్నీ ఉంటాయని ఆయన తెలిపారు. 'రెమో' సినిమాలో హీరో శివకార్తికేయన్ లేడీ గెటప్‌కి ప్రోస్తటిక్ చేసిన మేకప్‌మేన్ నిక్కీ.. ఈ సినిమాలో విశ్వక్‌ని లైలాగా మార్చారని, ఆ గెటప్‌లో విశ్వక్‌ని చూసి కళ్లు తిప్పుకోలేకపోయామని, ఇందులో పాత్రల్నీ కీలకమేనని, సాంకేతికంగా సినిమా రిచ్‌గా ఉంటుదని రామ్‌నారాయణ్ తెలిపారు.

బాలీవుడ్‌లో బంపరాఫర్

'పుష్ప-2'లో ఐటెం సాంగ్ 'కిస్సిక్' కథానాయిక శ్రీలీల జాతకాన్నే మార్చివేసింది. ముఖ్యంగా ఈ పాటతో ఉత్తరాది యువతరంలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుందీ అమ్మడు. దీంతో బాలీవుడ్ వరుస అవకాశాలు వరిస్తున్నాయి. ఇప్పటికే యువహీరో ఇబ్రహిమ్ అలీఖాన్ సరసన ఓ చిత్రంలో నాయికగా నటిస్తున్నది శ్రీలీల. ఆమెకిది తొలి హిందీ చిత్రం. తాజాగా ఈ భామ బాలీవుడ్‌లో భారీ ఆఫర్‌ను దక్కించుకుంది. అగ్ర హీరో కార్తిక్ ఆర్యన్ సరసన కథానాయికగా నటించనుంది. అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తారు. తొలుత త్రిప్తి డిమ్రీని కథానాయికగా ఎంపిక చేయగా..చివరి నిమిషంలో ఆమెను తప్పించి శ్రీలీలను ఖరారు చేశారు. మార్చిలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. 'ఆషికీ-3'లో అవకాశం రావడం పట్ల శ్రీలీల ఆనందం వ్యక్తం చేసింది. బాలీవుడ్‌లో తన కెరీర్‌కు బ్రేక్‌నిచ్చే చిత్రమవుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

విశాఖపట్నంలో యాక్షన్

అగ్ర హీరో ఎన్టీఆర్ ప్రస్తుతం 'వార్-2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా అనంతరం ఆయన 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రీప్రొడక్షన్ వర్క్ పూర్తిచేసుకున్న ఈ సినిమా వచ్చే వారం సెట్స్‌మీదకు వెళ్లనున్నట్లు తెలిసింది. విశాఖపట్నం అడవుల్లో తొలి షెడ్యూల్ మొదలవుతుందని, అక్కడ కొన్ని కీలక ఘట్టాలను తెరకెక్కించబోతున్నారని సమాచారం. కొద్దిరోజుల తర్వాత ఎన్టీఆర్ షూట్‌లో జాయిన్ అవుతారని చెబుతున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ ఖరారు చేశారని ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంలో చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఎన్టీఆర్‌ను అత్యంత శక్తివంతమైన పాత్రలో ఆవిష్కరిస్తూ హై ఓల్టేజ్ యాక్షన్ డ్రామాగా దర్శకుడు ప్రశాంత్‌నీల్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.

నవతరం ప్రేమకథ

అగ్ర హీరో ధనుష్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'నిలవుకు ఎన్ మేల్ ఎన్నాడి కోబమ్' చిత్రం తెలుగులో 'జాబిలమ్మ నీకు అంత కోపమా' పేరుతో ప్రేక్షకుల ముందుకురానుంది. ధనుష్ డైరెక్ట్ చేసిన మూడో చిత్రమిది. ఈ నెల 21న విడుదలకానుంది. పవీష్, అనిఖా సురేంద్రన్, ప్రియా ప్రకాష్ వారియర్, మాథ్యూ థామస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలుగులో రిలీజ్ చేస్తున్నది. సోమవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్ ప్రారంభంలో కనిపించిన ధనుష్.. ప్రేమకథ గురించి వివరిస్తుంటాడు. ప్రేమ, బ్రేకప్ నేపథ్యంలో న్యూఏజ్ లవ్‌స్టోరీగా ఆద్యంతం చక్కటి హాస్యంతో ట్రైలర్ ఆకట్టుకుంది. మాజీ ప్రేయసి పెళ్లికి వెళ్లాల్సిన పరిస్థితి రావడం, అక్కడ ఎదురయ్యే సంఘటనలు అన్నీ యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉన్నాయి. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్నందించారు.

'శివ శివ శంకర' గీతావిష్కరణ

మంచు విష్ణు టైటిల్ రోల్‌ని పోషిస్తున్న భక్తిరస ప్రధాన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా మంగళవారం 'శివా శివా శంకరా' అంటూ సాగే తొలిపాటను విడుదల చేశారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ బెంగళూరులో ఈ గీతాన్ని విడుదల చేశారు. స్టీఫెన్ దేవస్సీ స్వరపరచిన ఈ గీతానికి రామజోగయ్యశాస్త్రి సాహిత్యాన్ని అందించారు. విజయ్‌ప్రకాష్ ఆలపించారు. ఈ పాటను పండిట్ రవిశంకర్ ఆవిష్కరించడం ఆనందంగా ఉందని, ఇదొక గొప్ప ఆధ్యాత్మిక అనుభవమని మోహన్‌బాబు పేర్కొన్నారు. 'కన్నప్ప' చిత్రంలో రుద్రుడిగా ప్రభాస్, శివుడిగా అక్షయ్ కుమార్, పార్వతీ మాతగా కాజల్ అగర్వాల్ కనిపించనున్న విషయం తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నారు.

500కోట్ల బడ్జెట్‌తో పునర్జన్మల కథ

'జవాన్' చిత్రంతో బాలీవుడ్ పరిశ్రమ దృష్టిని ఆకర్షించారు తమిళ దర్శకుడు అట్లీ. ప్రస్తుతం ఆయన సల్మాన్‌ఖాన్‌తో భారీ పాన్ ఇండియా చిత్రానికి సిద్ధమవుతున్నారు. పునర్జన్మల నేపథ్య కథాంశంతో సాగే పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి 500కోట్లకుపైగా బడ్జెట్‌ను ఖర్చు పెట్టబోతున్నారట. 'దర్శకుడు అట్లీ ఈ సినిమా కోసం ఓ సరికొత్త ఫాంటసీ ప్రపంచాన్ని సృష్టించబోతున్నారు. ముఖ్యంగా పునర్జన్మలకు సంబంధించిన ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుంది. అందుకోసం భారీ వ్యయం అవసరమవుతుంది. సల్మాన్‌ఖాన్ కెరీర్‌లోనే హయ్యెస్ట్ బడ్జెట్ ఫిల్మ్ ఇది' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ సినిమాలో రజనీకాంత్ కీలక పాత్రను పోషించబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సల్మాన్‌ఖాన్ 'సికందర్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. దీని తర్వాత అట్లీ డైరెక్ట్ చేసే సినిమా పట్టాలెక్కనుంది.

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్

బ్లాక్‌బస్టర్ 'లవ్ టుడే' తర్వాత ప్రదీప్ రంగనాథన్ నుంచి వస్తున్న చిత్రం 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రానికి కల్పాతి ఎస్.అఘోరం, కల్పాతి ఎస్.గణేష్, కల్పాతి ఎస్.సురేష్ నిర్మాతలు. ఈ నెల 21న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని మంగళవారం మేకర్స్ విడుదల చేశారు. యూత్‌కి కావాల్సిన వినోదం, ప్రేమ, రొమాన్స్, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ట్రైలర్ ఆద్యంతం సాగింది. ఇంజనీరింగ్‌లో 48 బ్యాక్‌లాక్‌లు పెట్టుకునీ.. కాలేజీలో పనీపాట లేకుండా గాలికి తిరిగే కుర్రాడిగా ప్రదీప్ రంగనాథన్ ఈ ట్రైలర్‌లో కనిపించారు. కేఎస్ రవికుమార్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, మిస్కిన్ వంటి స్టార్ డైరెక్టర్లు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి, సంగీతం: లియోన్ జేమ్స్.

తకిట తదిమి తందాన

ఘన ఆదిత్య, ప్రియ జంటగా నటిస్తున్న చిత్రం 'తకిట తదిమి తందాన'. రాజ్ లోహిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎల్లో మాంగో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చందన్ కుమార్ కొప్పుల నిర్మిస్తున్నారు. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఇటీవల సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. అందమైన ప్రేమకథా చిత్రమిదని, వినోదప్రధానంగా ఆకట్టుకుంటుందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: పి.ఎన్.అంజన్, సంగీతం: నరేన్ రెడ్డి, దర్శకత్వం: రాజ్ లోహిత్.